క్లుప్తంగా

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: బాల కార్మికుల గుర్తింపునకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని షాపులు, హోటళ్లలో కార్మిక, శిశుసంక్షేమం, మహిళా పోలీసులు సంయుక్తంగా సోదాలు జరిపారు. 18 ఏళ్ల లోబడి పనులు చేస్తున్న ముగ్గురు పిల్లలను గుర్తించారు. సంబంధిత యజమానులకు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ, లేబర్ ఆఫీసర్లు కృష్ణయ్య, శేఖర్‌బాబు, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన


దోమల నిర్మూలనకు మందు స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీలోని వడ్రహట్టి గ్రామంలో సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా తెలియజేశారు. సూపర్‌వైజర్ నరసారెడ్డి, వైద్య సిబ్బంది సుందర్య, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోండి


ముస్లింలతో మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్షావలి

రొళ్ల: త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ వేడుకలను ముస్లింలు శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పోలీస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య తదితర శాఖల సిబ్బంది, ముస్లింలతో కలిసి బక్రీద్ వేడుకల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ మసీదులు, ఈద్గా మైదానాల వద్ద ప్రత్యేకంగా ప్రార్థనల నేపథ్యంలో శుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

లేపాక్షి: స్థానిక ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మండల వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల కుక్ కమ్ హెల్పర్లతో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప శుక్రవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వంటకాలకు వాడే పదార్థాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. వంటగది శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, వేడి భోజనం సరఫరా వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆలయంలో చోరీ


హుండీని పగలగొట్టిన దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని బూదిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం రాత్రి దొంగలు గుడి తాళాలు ధ్వంసం చేసి హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఏడాదిగా హుండీనిలోని కానుకలను లెక్కింపు చేయలేదని చెప్పారు. ఇటీవల ఆంజనేయస్వామి జాతర నిర్వహించినట్లు తెలియజేశారు. హుండీలో పెద్ద ఎత్తున నగదు ఉంటుందన్నారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. శుక్రవారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చిగుతుర్పిలో ఎలుగుబంటి సంచారం

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో గురువారం రాత్రి ఎలుగుబంటి రావడంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చిగతుర్పి దారి మధ్యలో ఉన్న గుడిసెలోకి ఎలుగుబంటి దూరడంతో స్థానికులు కేకలు వేసి దాన్ని తరిమికొట్టారు. ఎలుగుబంటి సంచారంపై గ్రామ ప్రజలు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎలుగుబంటి బారి నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 'పురం' ఎంజీఎంలో 'ఫుట్‌బాల్' ఉచిత శిక్షణ
- సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా క్రీడా శిక్షణ శిబిరంలో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని మెలకువలను నేర్చుకుంటున్నారు. పట్టణంలోని స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎంజీఎం) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం విద్యార్థులతో సందడిగా మారింది. ఎంజీఎం పాఠశాల పీడీ, ఫుట్‌బాల్ శిక్షకులు లోక్‌నాథ్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు విజయవాణి, వెంకటేష్, చంద్రశేఖర్, హర్షవర్ధన్, శ్రీనివాస్ బాబులు ఇస్తున్న శిక్షణలో 50 మంది దాకా పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి బాల, బాలికలు పాల్గొంటూ మెలకువలు నేర్చుకుంటున్నారు.


ఫుట్‌బాల్ శిక్షణకు హాజరైన విద్యార్థులు

జాతీయస్థాయిలో రాణిస్తున్నారు



వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఫుట్‌బాల్‌లో మెలకువలను నేర్పుతున్నాం. ఆసక్తి గల విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ఫుట్‌బాల్‌పై ఆసక్తితో విద్యార్థులు వస్తున్నారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించడమే కాకుండా వారు భవిష్యత్తు మంచిగా రాణించేలా శిక్షణను అందిస్తున్నాం.

– లోక్‌నాథ్, పీడీ , ఫుట్‌బాల్ కోచ్

శిక్షణ బాగా ఉపయోగపడుతుంది



ఫుట్‌బాల్ అంటే నాకు చాలా ఇష్టం. ఫుట్‌బాల్‌లో రాణించాలన్న ఆశయంతో ఇక్కడ శిక్షణకు హాజరవుతున్నాను. ఎంతో చక్కగా కోచ్ తమకు ఫుట్‌బాల్‌ను నేర్పుతున్నారు. ఫుట్‌బాల్ ఆటతీరును వివరిస్తున్నారు. మెళకువలను నేర్చుకుంటున్నాను. ఆటలో రాణించేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతోంది.

– పరాత్పర్, 2వ తరగతి

బాగా నేర్పుతున్నారు



ఫుట్‌బాల్‌పై ఉన్న ఆసక్తితో వేసవి సెలవుల్లో వేసవి శిక్షణా శిబిరంలో చేరాను. ఇక్కడ ఫుట్‌బాల్ ఆటను బాగా నేర్పుతున్నారు. ఫుట్‌బాల్‌ను నేర్చుకోవడం సంతోషంగా ఉంది. కోచ్ చక్కా నేర్పుతూ మాతో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఫుట్‌బాల్‌లో మెలకువలు నేర్చుకొని బాగా రాణించగలననే నమ్మకం కలిగింది.

– అనన్యా, 4వ తరగతి

జగనన్నను విమర్శించే అర్హత మీకెక్కడిది?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: మాజీ సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను విమర్శించేస్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్ శివకుమార్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో వేధింపులు, హత్యలు, అత్యాచారాలే కనిపిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలిచ్చి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామంలో ఒక్క సీసీ రోడ్డు అయినా వేశారా చెప్పండి అని స్థానిక దళిత నాయకులను ప్రశ్నించారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇదేనా మీరు చేసిన అభివృద్ధి అని మండిపడ్డారు. పదవులకు ఆశపడి వైఎస్ జగన్‌ను, ఈరలక్కప్పను విమర్శిస్తే చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. స్థాయిని గుర్తించి మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, అనుబంధ కమిటీ సభ్యులు బోజేగౌడ్, నాగేష్ , శ్రీనివాసులు, హరిష్ నాయకులు కృష్ణ, మధు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

గుడిబండ: 'ఏదో చేసేస్తాం.. రాష్ట్ర ప్రజలను ఉద్ధరిస్తాం అంటూ సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరో 120 హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని ఫళారం గ్రామంలో అగళి మండలం హెచ్‌డీ హళ్లి పంచాయితీలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సమన్వయకర్త ఈరలక్కప్పను కలిసి గ్రామాల్లోని సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం కల్పిస్తామని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే


హెచ్‌డీ హళ్లి నాయకులతో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

వాహనాలను రద్దు చేసి ప్రజలకు కష్టాలు రుచి చూపిస్తున్నారని మండిపడ్డారు. కూటమి దుష్టపాలనతో ప్రజలు విసిగి పోయారని, కూటమి నాయకులు తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరాయప్ప, గుండన్న, ప్రకాష్, నరసింహరాజు, రాజన్న, దనుంజయ, జగదీష్, రమేష్, సురేష్, మూర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ చాలా క్రమశిక్షణ కలిగిన పార్టీ అని ఆ పార్టీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో లేపాక్షి మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడేవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. అధికార పక్షం నేతలు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా భయపడవద్దని, తామంతా అండగా ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక సూచనలతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు కష్టాల్లో తోడుగా నిలబడాలన్నారు. టీడీపీ నేతల అవినీతి అక్రమాలను తమ దృష్టికి తీసుకువస్తే వారిని ప్రజల ముందు దోషిలా నిలబెడతామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కూటమి


లేపాక్షి మండల నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బషీర్, మాజీ ఎంపీటీసీ మల్లన్న, డీలర్ నర్సా, బింగిపల్లి భాస్కర్‌రెడ్డి, రామాంజి,అన్వర్,చాంద్‌భాషా, తంజీర్, సాహిద్ గంగాధర్, నాగేంద్ర, నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

కొండపై ఆలయాన్ని పునఃనిర్మించండి


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ: పెనుకొండ కొండపై పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునః నిర్మించాలని పలువురు బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. నాసిన్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రిని కలసిన నాయకులు శేఖర్‌స్వామి, రామకృష్ణ, రామాంజినేయులు తదితరులు పెనుకొండ రాజరికపు వైభవం ఎంతో ఘనమైందన్నారు. అయితే అనేక కట్టడాలు కాలగర్భంలో కలసిపోగా ఇతర కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయని వివరించారు. ఇందులో భాగంగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం శిథిలావస్థలో ఉందని ఆలయ పునఃనిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా పెనుకొండలో పర్యాటకం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్పందించిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో ఈనెల 10న జరిగే యోగా దినోత్సవాన్ని అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 10న లేపాక్షిలో నిర్వహించే యోగా కార్యక్రమానికి 2 వేల మంది పాల్గొనేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆ రోజు విద్యుత్ సరఫరా, హెల్త్‌క్యాంపు, పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక ప్రదేశాల్లో ముందస్తుగా యోగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల మరింత ప్రాధాన్యత పెరిగి పర్యాటకులు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, సీడీపీఓ శాంతమ్మ, ఎంఈఓ నాగరాజు,


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసయ్య

ఏసీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 8న యోగాంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రజలు తప్పక హాజరు కావాలని కోరారు.

విత్తన పంపిణీ సజావుగా జరగాలి

పెనుకొండ: విత్తన వేరుశనగను పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామంత్రి సవిత వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచి రైతులు ఎక్కువ విస్తీర్ణం సాగు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో స్టాకు ఉన్న విత్తన వేరుశనగ వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీ కృష్ణమీనన్, ఏఓ చందన తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి ఇద్దరికి గాయాలు


ద్విచక్రవాహనంపై విరిగిపడిన చింత కొమ్మ

మడకశిర: చింత కొమ్మ ద్విచక్ర వాహనంపై విరిగి పడడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వైబీ హళ్లికి చెందిన సూర్యబాబు, కర్ణాటకలోని హిరియూర్ ప్రాంతానికి చెందిన మల్లేష్ ఇద్దరూ కల్లు గీయడానికి ఆమిదాలగొంది వద్ద ఈత చెట్లను అద్దెకు తీసుకున్నారు. వారు ఆమిదాలగొందికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ద్విచక్ర వాహనం పావగడ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టు కొమ్మ ఉన్న విరిగి పడింది. ద్విచక్ర వాహనంపై పడడంతో సూర్యబాబు, మల్లేష్ చెట్టుకొమ్మ కింద ఇరుక్కుపోయారు. స్థానికులు వెంటనే చెట్టు కొమ్మను తొలగించి గాయపడిన వారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు. సూర్యబాబు స్వల్పంగా గాయపడగా.. మల్లేష్ తలకు దెబ్బతగలడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


ఛాయా


వినోద్‌కుమార్


భవ్యశ్రీ


అంకిత


కేసీ శిరీష


జీఎస్ చిర్రై

పరిగి/లేపాక్షి:/రొళ్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ ఎంపికకు ఇటీవల నిర్వహించిన టెస్టులో పరిగి మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న కేసీ శిరీష, జీఎస్ చిర్రై తాజాగా వెలువడిన ఫలితాల్లో స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారన్నారు. వీరికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటూ ప్రభుత్వం ద్వారా అందుతుందన్నారు. మరోవైపు లేపాక్షి మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పూజారి భవ్యశ్రీ, అంకిత కూడా స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. అలాగే రొళ్ల మండల పరిధిలోని టీడీ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఛాయా, వినోద్‌కుమార్, లేఖన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు హెచ్ఎం భాగ్యలక్ష్మి తెలిపారు.

బ్యాడనూరు అధ్యక్షురాలిగా రుక్మిణి

పావగడ: తాలూకాలోని బ్యాడనూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా రుక్మిణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 14 ఓట్లలో అక్కమ్మకు 5 ఓట్లు పడగా రుక్మిణికి 8 ఓట్లు పోలయ్యాయి. ఒక ఓటు చెల్లలేదు. దీంతో రుక్మిణి 3 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి జానకీరాం ప్రకటించారు. నూతన అధ్యక్షురాలు రుక్మిణిని తోటి సభ్యులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

ఈ-కేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే బియ్యం

రొళ్ల: మండల వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డులు ఉండి ఈ-కేవైసీ చేయించుకోని వారు వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. గత రెండు నెలలుగా లబ్ధిదారులకు ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పిన కూడా ఇంత వరకూ చాలా మంది పట్టించుకోలేదని గుర్తు చేశారు. దీంతో ఈనెల 15వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకుంటేనే వచ్చే నెల నుంచి బియ్యం అందుతాయని, లేకపోతే బియ్యం అందవని స్పష్టం చేశారు.

విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు

మడకశిర: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు టీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్‌కు విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణ్, సందీప్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసి పాసైన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు విద్యార్థులకు సంబంధించిన టీసీ, స్టడీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలతో చర్చించి పదో తరగతి పాసైన వారికి వెంటనే టీసీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేక పోతే ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌కు చెందిన సుజాత కనిపించడంలేదని ఆమె భర్త శ్రీనివాసులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే గురువారం ఉదయం ఇద్దరు పిల్లలతో కలిసి పిల్లవాడికి ఆస్పత్రికి తీసుకెళ్తానని ఇంటి నుంచి వెళ్లిందని శ్రీనివాసులు పోలీసులకు తెలిపారు. అప్పటి నుంచి కనిపించకుండా పోయిందన్నారు. బంధువులతో విచారించినా ఆమె ఆచూకీ తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయింపు

పావగడ: తాలూకా వ్యాప్తంగా సుమారు 60 వేల మంది వాల్మీకి సామాజిక వర్గం జనాభా ఉన్నా ఇంతవరకూ వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించలేదు. అయితే స్థానిక మున్సిపల్ చైర్మన్ సుదేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎట్టకేలకు విగ్రహ ఏర్పాటుకు బాపూజీ పాఠశాల వద్ద స్థలం కేటాయించారు. సుమారు రూ. 5 లక్షల మున్సిపల్ నిధులతో త్వరలోనే వాల్మీకి విగ్రహాన్ని నిర్మిస్తామని మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్, మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ ఉన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానాభివృద్ధి

అమరాపురం: విద్యార్థులు నిత్యం పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాభివృద్ధి పొందవచ్చని స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామచంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన ముగింపు శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం, పుస్తక పఠనం, కథలు చదవడం, కథనాలు, బొమ్మలు గీయడం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు యోగ గురువు కిశోర్, హెచ్ఎం బహుమతులను అందించారు.


విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో అఖండ భజన


అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మడకశిర: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కన్యకాపరమేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించి అఖండ భజన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అఖండ భజనలో పాల్గొన్న భక్తులు

కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ఆదరణ

హిందూపురం: పట్టణంలోని శ్రీవాసవి ధర్మశాల ఎస్‌వీడీ రోడ్డులో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్పందన లభిస్తోంది. ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైనర్, పోచంపల్లి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్స్ షర్టింగ్స్, జ్యువెల్లరీ, బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వినోద్‌జైన్ తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టన్స్, స్టోన్ జ్యువెల్లరీ, పెరల్స్, క్రాఫ్ట్స్, బంజారా, కోల్‌కత్తా బ్యాగులు, ఒడిశా పెయింటింగ్స్, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోటా బాందేజిన్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, ఉత్తరప్రదేశ్ జామ్దాని, బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్ లభిస్తాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా ఉంటుందని తెలిపారు.


ప్రదర్శనలో సందర్శకులు